వృథాగా భగీరథ నీరు

రహీంగూడ తండా వద్ద లీకవుతున్న భగీరథ నీరు

చిలిపిచెడ్, మే 23: మండలంలోని శీలాంపల్లి, రహీంగూడ తండా ప్రధాన రోడ్డుపై మిషన్ భగీరథ తాగు నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మండలంలోని చిట్కుల్, బద్రియ తండా, గన్నే తండాల్లో ప్రజలు తాగు నీటికి తండ్లాడుతుంటే, ఈ గ్రామాల్లో నీరు వృథాగా పోతున్నది. శీలాంపల్లిలో నీటిని అందించే ట్యాంకులోంచి నీరు వృథాగా పోతోంది. చిలిపిచెడ్-కౌడిపల్లి ప్రధాన రోడ్డు పక్కన మిషన్ భగీరథ నీరు వృథాగా ప్రవహిస్తున్నది. రహీంగూడ తండా ప్రధాన రోడ్డుపై నీరు లీకేజీ అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహిస్తున్నారు.

ప్రభుత్వ దవాఖానలో డీఎంహెచ్‌వో తనిఖీ

రేగోడ్, మే 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్ గురువారం తనిఖీ చేశఱూరు. పలు రికార్డులను పరిశీలించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో సిబ్బంది మఝర్ కమల్, పార్వతి ఉన్నారు.

రామాయంపేటలో శివలింగాల తయారీ

రామాయంపేట, మే 23: కాశీలో జరుగబోయే కోటి పార్థివ లింగాల అర్చన, అభిషేకాల కోసం రామాయంపేటలోని ఆర్య వైశ్య మహిళలు మృత్తిక లింగాలు తయారు చేస్తున్నట్లు కాశీవాసి గౌలి అశోక్ గుప్తా గురువారం తెలిపారు. లింగాల తయారీ పూర్తయిన తర్వాత వీటికి పూజలు చేసి కాశీకి తీసుకెళ్తామన్నారు.

వైభవంగా బండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మే 23: దుర్గమ్మ జాతరలో భాగంగా గురువారం చీలపల్లి గ్రామంలో వైభవంగా బండ్ల ఊరేగింపు నిర్వహించారు. బండ్లను అందంగా అలంకరించి హనుమాన్ మందిరం నుంచి గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ దుర్గమ్మ గుడి వద్ద ఐదు ప్రదక్షిణలు చేయించారు. ఉత్సవాల్లో భాగంగా రైతులు ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

బాధిత కుటుంబానికి నాయకుల ఆర్థిక సాయం

గోష్కె సురేశ్ (ఫైల్)

రామాయంపేట, మే 23: గుండెపోటుతో మృతిచెందిన యువకుడి కుటుంబానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్, బీజేపీ నాయకులు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. మండలంలోని డీ.ధర్మారానికి చెందిన గోష్కె సురేశ్(24) కు గురువారం ఉదయం చాతిలో నొప్పి వచ్చి కింద పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబీకులు స్థానిక దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం రామాయంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అంత్యక్రియల కోసం గ్రామస్తులు చందాలు వేసుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాధిత కుటుంబానికి రూ10వేలను కార్యకర్తల ద్వారా అందజేశారు. బీజేపీ నాయకులు రూ.5వేలు అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

CHANGE OF NAME

★I, SHAIK GHOUSE PASHA, R/o. H.No. 12-4-90/8/A, Naseer Nagar, Near Naseeria Masjid, Siddipet Town & (Urban) Mandal, Siddipet Dist., TS. I Changed My Name from GAUS PASHA to SHAIK GHOUSE PASHA and I henceforth be called as SHAIK GHOUSE PASHA only.
NT-319524

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ప్రగతి

విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్, పక్కన టీచర్లు, తల్లిదండ్రులు

సర్టిఫికెట్లు అందజేసిన అనంతరం విద్యార్థులతో కలెక్టర్ రాహుల్ రాజ్

- సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం జిల్లాకే గర్వకారణం
- ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ/ చిలిపిచెడ్/ చేగుంట, మే 23: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులే ఉత్తమ ప్రగతి సాధిస్తున్నారని, పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకులు సాధించడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మెదక్‌లోని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హెచ్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు, సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో సుమారు 400 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టని, బంగారు భవిష్యత్తుకు దశా దిశను నిర్దేశించేందని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పద్ధతి ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ఇంటర్ ఆ తరువాత ఏ సబ్జెక్టు తీసుకుని ఏయే రంగాల్లో రాణించగలుగుతారని విద్యార్థులను కలెక్టర్ రాహుల్‌రాజ్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం 10/10, 9.8, 9.5 జీపీఏలు సాధించిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

మెదక్ పట్టణంలోని పరీక్షా కేంద్రం

మెదక్ మున్సిపాలిటీ, మే 23: పాలిసెట్-2024 నేడు (శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడేండ్లు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, డిప్లొమా కోర్సులతోపాటు వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, సిద్దార్థ ఆదర్శ జూనియర్ కళాశాల, సిద్దార్థ మోడల్ హైస్కూల్‌లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 1573 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. గంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నట్లు తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబడదన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 22 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 6110 మంది విద్యార్థులు
- వర్తించనున్న నిమిషం నిబంధన

మెదక్ మున్సిపాలిటీ, మే 23: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగనున్నాయని, ఇందుకు జిల్లాలో 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్ నోడల్ జిల్లా అధికారి సత్యనారాయణ తెలిపారు. ప్రథమ సంవత్సర పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 6110 మంది విద్యార్థుల్లో ప్రథమ సంవత్సరం 3812 మంది, ద్వితీయ సంవత్సరం 2298 మంది పరీక్షలు రాయనున్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్టుమెంట్ అధికారి, నాలుగు సిటింగ్ స్క్వాడ్ బృందాలు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, నలుగురు కస్టోడియన్లను నియమించినట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు సరిచేయండి సార్



వేలాడుతున్న విద్యుత్ తీగలు

విరిగి పడిన విద్యుత్ స్తంభం

చిలిపిచెడ్, మే 23: గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికి అందేంత కిందికి ఉండడంతో ప్రజలు, రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఈదురు గాలులు వస్తే కరెంట్ తీగలు ఎప్పుడు తెగి పడుతాయోనని స్థానికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు అడిగినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిలిపిచెడ్ మండలంలోని చండూర్, చిట్కుల్, బద్రియ తండాలోని పొలంలో చెట్టు కొమ్మపై విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తుకున్నారు. కొంతమంది పొలంలో భూమి తాకేలా ప్రమాదకారంగా విద్యుతు తీగలు ఉన్నాయి. పొలంలో విద్యుత్ తీగలు సరి చేయాలని ఎన్నిసార్లు అధికారులు, ఏఈ రాంబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గంగారం గ్రామ శివారులో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ మీద ఈదురు గాలులతో విద్యుత్ స్తంభం విరిగి ఇరువై రోజులు గడుస్తున్న విద్యుత్ అధికారులు స్పందించడంలేదని మండిపడ్డారు. ఇప్పుటికైనా అధికారులు స్పందించి వానకాలం ప్రారంభం కాకముందే సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

ఐదు రోజులుగా కరెంట్ లేక అవస్థలు పడుతున్న రైతులు

పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం

కౌడిపల్లి, మే 23: మండలంలోని తునికి గ్రామంలో గాలివానకు ఐదురోజులుగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో గాలివాన బీభత్సానికి తునికి పరిసర ప్రాంతాల్లోని బోర్లలకు వెళ్లే 11 కేవీ స్తంభాలు విరిగిపడ్డాయి. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేయకుండానే విద్యుత్ శాఖ అధికారులు వదిలేశారు. దీంతో వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో బోరుబావుల వద్ద పశువులకు నీళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వెంటనే చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వర్‌రావును వివరణ కోరగా గాలివాన బీభత్సానికి స్తంభాలు విరిగి, కరెంటు అంతరాయం మాట వాస్తవమేనన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులకు అత్యవసరం లేనందున, మెటీరియల్ లేకపోవడంతో పనులు లేటవుతున్నాయని తెలిపారు. మరో రెండు రోజుల్లో కావాల్సిన మెటీరియల్‌ను తీసుకొచ్చి మరమ్మతులు చేస్తామని ఆయన చెప్పారు.

మల్లన్న ఆలయంలో హోమం

మెదక్ రూరల్ మే 23: మండలంలోని మంభోజిపల్లి శివారులో ఉన్న కొయ్యగుట్ట మల్లన్న స్వామి ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఉపాధి కూలీలకు సకాలంలో చెల్లింపులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, మే 23: ఉపాధి హామీ కూలీలకు సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉపాధి హామీ పథకం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడా లని సూచించారు. కూలీలు పని చేసే ప్రదేశంలో తాగునీరు, షెడ్‌నెట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పనుల్లో నాణ్యత, నర్సరీ ప్రతిపాదనలు, అమృత్ సరోవర్ పనులు మొదలగు అంశాలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. సమావేశంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బగలాముఖి శక్తిపీఠంలో మహా పూజలు

బగలాముఖి శక్తిపీఠంలో పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట, మే 23: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహా పూజ నిర్వహించారు. ఉదయం పీతవర్ణ వస్త్రాలతో విశేష అలంకరణ గావించి, అమ్మవారికి అభిషేకం, హరిద్రార్చన అష్టోత్తర శత నామార్చనలు, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ధ్యాన మందిరంలో బగలాముఖి మహామంత్ర హవనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ భక్తులందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో శక్తిపీఠం కార్యనిర్వాహక సభ్యుడు జిన్నారం పెద్దగౌని సూర్యం కుమార్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, వంజరి కొండల్, బాసంపల్లి పోచగౌడ్, విశ్వశ్రీ లా చాంబర్స్ సీఈవో లిఖిత, నల్లపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

- ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 23: పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ బాలస్వామి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జూన్ 8న మేగా లోక్ అదాలత్ ఉన్నదని, రాజీ పడే అవకాశం ఉన్న కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ చేసేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి, ఏఏ అంశాలు క్రోడీకరించాలి అనే వాటి గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, కోర్టులో చార్జి షీట్ దాఖలు చేయాలన్నారు. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, చాలెంజ్‌గా విధులు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. మిస్సింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, సైబర్ క్రైమ్‌ల వివరాలు, రిసెప్షన్, క్రైమ్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, వర్టికల్ విధులు నిర్వహించే అధికారులు పనితనాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని పట్టించుకోరా?

నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన గ్రామస్తులు

నర్సాపూర్, మే 23: రెండు నెలల నుంచి తాగునీటి ఎద్దడిని తీర్చాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని మాడాపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తమ గోడును విన్నవించుకోడానికి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. అనంతరం గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ మాడాపూర్‌లో రెండు నెలలుగా తాగునీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో నీటి ట్యాంకుకు సరఫరా అయ్యే బోరు రెండు నెలల క్రితం చెడిపోయిందని, దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శికి, ప్రత్యేకాధికారికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వ్యవసాయ బోర్ల వద్దకెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కిష్టయ్య, సంజీవ్, మహేందర్, నర్సింహులు, లింగయ్య, ప్రభాకర్, బ్యాగరి కిష్టయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ఉప్పలింగాపూర్‌లో బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, మే 23: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత వస్తుందని, హనుమాన్ మాల ధరించి భక్తిభావంతో ఉండడంతో అన్ని శుభాలు కలుగుతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. వెల్దుర్తిలో హనుమాన్ మాల ధరించిన బీఆర్ఎస్ నాయకుడు కమ్మరి శ్రవణ్ నివాసంలో గురువారం హనుమాన్ మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

పార్టీ బీమా చెక్కు అందజేత

మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన కుంట్ల పాండు కొద్ది నెలల క్రితం గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందాడు. అతడు బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ బీమా సొమ్ము రూ.2 లక్షలు వచ్చాయి. గురువారం ఉప్పులింగాపూర్ గ్రామంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్,శాఖారంశ్రీను, రమేశ్‌గుప్తా, కృష్ణాగౌడ్, చందు, ఖాజామొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీ

వినియోగదారుల ఎదుట బంకులో తనిఖీ చేస్తున్న అధికారులు

శివ్వంపేట, మే 23: పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో ఏవైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్, మెట్రాలజీ అధికారి సుధాకర్ అన్నారు. పెట్రోల్ తక్కువ వస్తున్నదని ఆరోపణలు ఎదుర్కొంటున్న శివ్వంపేట అంజన (భారత్) పెట్రోల్ బంకును గురువారం తనిఖీ చేశారు. కస్టమర్ల ఎదుట పెట్రోల్, డీజిల్ కొలతలు వేసి పరిశీలించారు. సేల్స్ బోర్డు, మదర్ బోర్డు పరిశీలించిన అనంతరం సుధాకర్ మాట్లాడుతూ పెట్రోల్ బంకులో మోసం జరుగుతున్నదని అందిన ఫిర్యాదు మేరకు అంజన ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ చేసినట్లు తెలిపారు. బంకులోని 4 పెట్రోల్, 4 డీజిల్ గన్‌లలో పెట్రోల్, డీజిల్‌ను కొలత చేయగా 5 లీటర్ల పెట్రోల్‌కు గాను 20 మిల్లీలీటర్లు తక్కువగా వస్తున్నదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లస్, మైనస్‌ల కింద ఇలాంటి చిన్న తప్పులపై చర్యల ఉపక్రమణకు తావులేదని, 50 మిల్లీ లీటర్లు తక్కువగా నమోదైతే తప్పకుండా బంకును సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. ఏటా పెట్రోల్ బంకులను రెన్యువల్ చేయడం కోసం జిల్లా లీగల్, మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో మదర్ బోర్డు, సేల్స్ బోర్డును పరిశీలించి సీల్ వేస్తామన్నారు. అంజన పెట్రోల్ బంకులో మరోసారి తనిఖీ నిర్వహించిన తర్వాతనే అమ్మకాలు జరపాలన్నారు. భారత్ పెట్రల్ బంకులో మరుగుదొడ్ల సౌకర్యం, ఉచిత ఎయిర్ సౌకర్యం ఏమీ లేవని, కస్టమర్లతో పెట్రోల్ బంకు సిబ్బంది దురుసుగా వ్యవరిస్తారని వినియోగదారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇలా వ్యవహరించడమేంటని బంకు సిబ్బందిపై ఆయన మండిపడ్డారు.

చిట్కుల్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు

చిట్కుల్‌లో రేణుకా ఎల్లమ్మతల్లి బోనాల ఊరేంగింపులో గౌడ్ సంఘం సభ్యులు

చిలిపిచెడ్, మే 23: మండలంలోని చిట్కుల్ గ్రామంలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవాలు నిర్వహించారు. గురువారం గ్రామంలో ప్రధాన వీధుల గుండా పోతరాజుల విన్యాసాలతో ఊరేంగిపుగా వచ్చి ఎల్లమ్మతల్లి బోనాలు సమర్పించారు. అనంతరం కొమ్ముల కవితా శ్రీనివాస్‌గౌడ్ అన్నదానం చేశారు. గౌడ్ సంఘం సభ్యులు యాదగిరిగౌడ్, ఈశ్వర్ గౌడ్, నారాగౌడ్, యాదాగౌడ్, రవీందర్‌గౌడ్ ఉన్నారు.

ఘనంగా బాల హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

పూజలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్,మే23ః నర్సాపూర్ మున్సిపల్ లోని 7వ వార్డులో బాల హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజల్లో పూజారి హరిప్రసాద్ శర్మ, కౌన్సిలర్ గొల్ల రుక్మమ్మ, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నర్సాపూర్, మే 23: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగింది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన గుర్తుతెలియని ఓ వ్యక్తి నీరసంగా చెట్టు కింద కూర్చొని ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు అతడిని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆ వ్యక్తి సంబంధించిన ఎలాంటి వివరాలు తెలియదు. మతిస్థిమితం లేనట్టుగా ఉందని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712657941, 8712657940 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.